# మురళి



రాచకొండ రంగనాథశర్మ

పది సంవత్సరాల తర్వాత అకస్మాత్తుగా బెజవాడ స్టేషన్లో కలిశాడు మురళీ. ఆ కలియడం కూడా చాలా విచిత్రంగా కలిశాడు...బెజవాడ నుంచి హైద్రాబాద్ వెళ్దామని నేను ఎక్స్ప్రెస్ ఎక్కుతుండగా నా జేబు ఎవరో కొట్టేస్తున్న ట్టనుమానం కల్గడం... నేను పెద్దగా "దొంగ...దొంగ... పోలీస్...పోలీస్" అని గావుకేకలు పెడుతూ జనంలోంచి తప్పించుకుని వెళ్ళిపోతున్న ఆ వ్యక్తి చొక్కా పట్టుకోవటం కొన్ని సెకండ్లలో జరిగిన విషయాలు...అప్పటి కప్పుడే చాల మంది పోగయిపోయారు...అతని వేపు తలెత్తి పరికించాను. ఆ క్షణంలో నా కాశ్చర్యం...షాక్...భాష కతీతమైన అఘాతాలు...విద్యుద్ఘాతాలు. .ఎన్నో తగిలాయ్...నివ్వెరపోతూ చొక్కా వదిలేశాను... జనంలో 'తన్నండి... వెధవని...దొరలా గున్నాడు: చేసేది దొంగపని...దుక్కలా గున్నావు— కూలి జేసుకు బతగరాదూ" నా కక్కష్ట మనిపించింది...ఒక్క నిముషం ఊరుకుని ఒక నిర్ణయాని కొచ్చిన వాడిలా అతని భుజంమీద చెయ్యి వేసి "నువ్వే గెల్చావ్ బ్రదర్...పద" అంటూ బయటకు నడిచాం...చేరిన జనమంతా ముఖాల్ని ఆశ్చర్యార్థకాలుగా మార్చుకుని...గొణుక్కుంటూ వెళ్ళిపోయారు...మురళీలో నాకే భావం,...

భయం...గోచరించలేదు...ధైర్యంగా.. స్టైయిల్‌గా నడుస్తున్నా డంతే...

'జస్ట్ ఏ మినిట్' కౌంటరు దగ్గర కెళ్ళి టికెట్ మార్చుకుని తిరిగి బయట కొచ్చాను.

'పోదాం పద.'

ఎక్కడికని అడుగుతా డను కున్నాను...సిగరెట్ తీసి అంటించి నన్ననుసరించాడు...సిగరెట్ ఆఫర్ చేస్తాడేమో ననుకున్నాను...నా జేబు లోంచే తీసుకుని కాల్చాను. చెక్క పొట్లం చిదిపి కుడిచేతిలో వేసు కున్నాను...తనే నా చేతిలోది సహం తీసుకుని నోట్లో వేసుకున్నాడు... మౌనంగా యిద్దరం నడుస్తున్నాం... నా ఆలోచనలు పరిపరి విధాల పరుగు లెత్తుతున్నాయ్...పదేళ్ళ తర్వాత కన్పించిన మురళీ ఎంతో సరదాగా హుషారుగా...ఎన్నెన్నో చెబుతా డనుకున్నాను...శిలా ప్రతిమలా మాటా మంతీ లేకుండా...కనీసం... నే నడిగినదానికైనా ? 'ఉహు' సమా ధానం లేదు...ఆ వింత మనస్తత్వం నా కర్ధం కాలేదు...పైగా...అయో మయ మనిపిస్తోంది – మెరుపులా నా తలలో 'సుజాత' మెరిసింది – 'సుజాత' ఏమైందో ? అడిగితే...సమాధానం వస్తుందని నమ్మక మేమిటి ? బహుశః సుజాతకు పెళ్ళయిపోయి ఉంటుంది – ఆలోచిస్తూనే సిగరెట్ పాకెట్ తీశాను...నేను ఒక సిగరెట్ తీసుకుం టూండగానే మురళీ మరో సిగరెట్ తీసి అంతవరకూ కాల్చిన సిగరెట్టు నంటించి పారేశాడు.

'ఏమి టలా వరుసగా తెగ కాలు స్తున్నావ్ ?'

'ఫరవాలేదు...యిప్పుడేం కొంప కూలిందిటా ! తప్పా ? ఏదో అలవా టయింది' లాంటి ఏ ఒక్క సమాధానం అతని నోటంట రాలేదు – తన ధోర ణిలో ముందుకు సాగిపోతున్నాడు. ఏమనడానికీ పాలుపోక ఊరుకున్నాను.

'సుజాత' తిరిగి అదే ఆలోచన... ఉద్యోగం చేస్తూందో లేదో ?

బహుశః పెళ్ళవగానే...ఒక వేళ అయితే...మానేసి ఉండవచ్చు. ఏమో మరి.

ఆలోచనల్లోంచి తేరుకుని పిలుపు వినిపించిన వైపు చూశాను...చెట్టు మొదట్లో బీడీలు కాలుస్తున్న ముగ్గురు వ్యక్తులు మురళీకి ఏవో సంజ్ఞలు చేస్తు న్నారు...మురళీ నవ్వుతూ ఏవో సమాధానా లిస్తున్నాడు, వాళ్ళ 'కోడ్' లోనే...నా కర్ధం కాలేదు...

ఆఖరుకు వీళ్ళతోనా వీడి స్నేహం??

ముగ్గురూ ఒకేరకమైన లాల్చీలు వేసుకున్నారు...ఎర్ర నిక్కర్లు... ఎండుగడ్డిలాటి జుత్తు...గారపళ్ళు... మెళ్లో మఫ్లర్లు...నిక్కరు కలర్లో నే



"ఏమిటి బాబూ! మీరంతా ఎవరికోసం ఈ గోడలమీద కాచుక్కూర్చున్నారు. ఈ దార్న మంత్రిగా రెవరన్నా వస్తున్నారా?"

"మంత్రిగా రెవరిగ్గావాలయ్యా? సినిమాతార."

---

కళ్లూ ఉన్నాయ్... కారాకిళ్ళీలు కాబోలు నవ్వుతున్నారు —

ఇంకక్కడ నిలబడ్డం అసహ్యమనిపించింది.

'పద వెళ్దాం' అన్నాను.

'కొత్త గురువుగారేంటి?'

అందులో ఒహాడన్నమాట నన్ను 'చెళ్ళు'న కొరడాతో కొట్టినట్లయింది.

'బ్రూటస్' మనసులోనే అనుకున్నాను.

మురళీ ఫకాలున నవ్వాడు.

శరీరం కోసి 'కారం' అంటించినట్లయింది.

నా చేత్తో గట్టిగా మురళీ చేతిని నొక్కాను.

ఏమిటన్నట్టు నా ముఖంలోకి చూశాడు.

'రిక్షాలో పోదాం?'

'సరే' అన్లేదు.

రిక్షావాణ్ణి నేనే కేకేశాను.

రిక్షా రాగానే ముందు తనే కూర్చున్నాడు....ఎంతని యిద్దరం అడగలేదు. నేనూ కూర్చున్నాను.

కాఫీ తాగుదామా?

తాగుదామన్లేదు మురళీ.

రిక్షావాణ్ణి ఆగమని డబ్బులిచ్చి పంపేశాను. యిద్దరం హోటల్లో పడ్డాం.

'ఏం తీసుకుందాం?'

'ఫలానా' అని చెప్పలేదు.

నేనే రెండు చపాతీలు అర్డ రిచ్చాను.

తర్వాత కాఫీ త్రాగాం ..సిగరె ట్లంటించాం.

రెండు జేబుల్లోనూ రెండు చేతులూ పెట్టుకుని హోటలు బయట కెళ్ళి నిలబడ్డాడు మురళీ కౌంటరు దగ్గర హోటల్ యజమాని ఓసారి నా వేపు తీక్షణంగా చూసి ఏదో అన బోయి ఊరుకున్నాడు. కొంతమంది నా వేపు 'వింతగా' చూస్తున్నట్టు అను మానం కలిగింది. నా కేం అర్ధంకాలేదు.

బయట కొచ్చి 'పద పోదాం' అన్నాను.

మరో సిగరెట్టంటించి నన్ననుస రించాడు

మా యిద్దరి మధ్య 'మౌనం' తప్ప మరేం లేదు.

కృష్ణానది వేపుగా నడుస్తున్నాం...

సిగరెట్టు తర్వాత సిగరెట్టు కాల్చి పారేస్తున్నాడు మురళీ.

యిదివరలో సిగరెట్టు వగైరాలు కాల్చేవాళ్ళను పరమ నీచంగా చూసే మురళీ యీ రోజు అది లేందే క్షణం గడపలేడన్నమాట అనుకున్నాను మనసులోనే ..కాలం తెచ్చే 'మార్పు' ఎంతటి చిత్రమైందో!

'సుజాత' ఎక్కడుంది? ఉండబట్ట లేక అడిగేశాను.

ముఖం పాలిపోయింది — 'శా విహీన మైంది — కత్తివాటుకు నెత్తురు చుక్క లేదు. తల దించుకున్నాడు' వంటి పదజాలం ఉపయోగించాల్సిన అవసరం నాక్కన్పించ లేదు . మౌనంగా కృష్ణానది వేపుగా చూస్తున్నాడంతే!

నా మేధాశక్తి కతీతమైన 'వింత మానవుడు'గా తయారైన మురళీని మరో ప్రశ్న అడిగే శక్తి. అడగాలనే ఆసక్తి రెండూ చచ్చిపోయాయ్ విచిత్ర ప్రకృతుల సమ్మేళనంతో తయారైన 'వింత పదార్థాన్ని' విడ దీయాలని వ్యర్థప్రయత్నం చేశాను. నా ఊహ కతీతమూ — నా భావనల కందరానిదీ అయి నా మస్తిష్కాన్ని వేడెక్కించింది. సిగరెట్టు పెట్టెలో ఆఖరి సిగరెట్టు చూశాకగాని పాపు గంటలో పది సిగరెట్లు కాల్చేశా నన్న ధ్యాసకూడా నాకు కల్గలేదు.

'ఇక్కడ కూర్చుందాం.'

నా మాట పూర్తవకుండానే అతను కూర్చున్నాడు

'మతి చలించిందేమో' ననుకు న్నాను — అలాటి పని జరగడానికి ఆస్కారమూ లేదనిపించింది — ఎందు కిలా జేబులు కొట్టాల్సిన అవసరం కలి గింది మురళీకి; ఎందు కేవిటి? పొట్ట గడవక? తను కాల్చే సిగరెట్ల కయే ఖర్చు క్లుప్తంగా గడుపుకునే యిద్దరు




వ్యక్తుల పొట్ట పోషిస్తుంది! అదో సరదా అనుకోవటాని గ్గూడా మార్గం లేదు! పట్టుబడి పోలీసుల్తో నడివీధి లోంచి వెళ్తూంటే అంతకంటె హీన మైంది....నీచమైంది....మరొకటుండదు....దొరలా కన్పించే యీ ఘరానా దొంగ పోలీసుల కళ్ళను ఎలా తప్పించుకుంటున్నాడో మరి? లేకపోతే....వాళ్ళ 'మద్దత్తు'తోనైనా నిర్విరామంగా తన పని సాగిస్తూండ వచ్చు!

'పోదాం' అన్నట్టు లేచి నిలబడ్డాడు మురళీ.

టౌను వేపుగా నడిచాం....

మురళీ....నేనూ చాలా కాలం క్రిందట సెకండ్ ఫారం నుంచి ఫోర్తు ఫారం వరకూ కల్సి చదువుకున్నాం అనకాపల్లి హైస్కూల్లో. మాది అనకాపల్లికి దగ్గర్లో నున్న తుమ్మపాల. అతను 'తగరంపూడి' నుంచి వచ్చేవాడు. అనకాపల్లి వెళ్ళటానికి మా వూరిమీదుగానే వెళ్ళాలి—అతను స్కూలుకు వెళ్ళేటప్పుడు తిన్నగా మా యింటి కొచ్చేవాడు...యిద్దరం కల్సి వెళ్ళేవాళ్ళం...వాళ్ళ నాన్న గారు బెజవాడలో పని జేసేవారు...

ఆస్థి వ్యవహారాల నిమిత్తం అప్పు డప్పుడు వచ్చేవారు. ఫోర్తు ఫారం చదువుతూండగా...వాళ్ళ నాన్న గారు ఉన్న భూముల్నీ...యింటినీ అమ్మేసి తగరంపూడి నుండి మకాం యెత్తేసారు...తర్వాత శాస్నాళ్ళ వరకూ మురళీ నేనూ కల్సుకోవటం తటస్థపడలేదు...ఎక్కడున్నారో ఏమో? ఏ విషయం కూడా నాకు తెలియలేదు...

చదువు పూర్తయాక ఉద్యోగా న్వేషణలో పడ్డాను. తొలిసారిగా నేను బిలాస్‌పూరులో రైల్వేలో ప్రవే శించాను అప్పటికే అక్కడ పని జేస్తున్న మురళీ నేనూ కల్సుకున్నాం.. డి. ఎమ్. ఇ ఆఫీసులో ఇద్దరం పనిజేసే వాళ్ళం .మురళీలో నాక్కన్పించిం దల్లా ఓ వ్యక్తిత్వం - బ్రతగనేర్చిన వ్యక్తిత్వం. అది—సిగరెట్లు కాల్చే వాళ్ళను చూసి అసహ్యాహించుకునే వాడు...మనిషి ఎప్పుడూ...నీటుగా . చలాకీగా ఉండేవాడు ..ఒక విధంగా తనెంతో అందమైన వాణ్ణనీ కన్నె పిల్లలు తనకోసం పడిఛస్తారనే అహం మాత్రం అతని ప్రతిమాటలోనూ వ్యక్త మయ్యేది—కాని అది నూటికి నూరుపాళ్లు అసంభవ మని రుజువు చేసింది సుజాత.

తన అందాన్నీ—పెర్సనాల్టీని అర్హతనూ అక్షరరూపంలో కాగితం మీద వెల్లడి చేస్తూ సుజాతకు పంపిన ప్రేమలేఖ తన ఉద్యోగాన్ని సహితం ఊడదీయించింది 'కాండక్ట్ రూల్స్' క్రింద అతన్ని డిస్మిస్ చేశారు ఆనాడే అతను 'ప్రతిజ్ఞా' చేశాడు ఎలాగయినా సుజాతనుతప్ప యింకెవర్నీ పెండ్లి చేసుకోనని . తర్వాత చాలాఎంక్వయిరీలు 'చేశాడు' సుజాత తాలూకువాళ్ళను గురించి... యీలోగా నాకు 'వాల్తేరు' ట్రాన్స్‌ఫర్ అవటంతో తర్వాత జరిగిం దేమీ నాకు తెలియలే-యీమధ్య శలవుపెట్టి అయినవాళ్ళందర్నీ ఓసారి చూద్దామని బయాల్దేరాను. బెజవాడలో ఉన్న మా పిన్నిగారింటి కెళ్ళి హైద్రాబాద్‌లో పనిజేస్తున్న మా అన్నయ్యదగ్గర కెళ్దా మని బయల్దేరుతుండగానే మురళీ కన్పించాడు. యింతకూ మురళీ సుజాతను పెళ్ళిచేసుకున్నాడో లేదో...ఒరేయ్ 'రాంగ్ నంబర్' (నాస్నేహితులు నాకిచ్చిన బిరుదు).

ఉలిక్కి పడ్డాను.

ఆలోచనలు 'కట్' అయాయి.

స్కూటర్ దిగుతున్న వ్యక్తివేపు ఒక్కక్షణం గుడ్లప్పగించి చూస్తూండి పోయాను పరిసరాలన్నీ నాకు తల క్రిందులుగాను . తికమకగానూ కన్పించసాగాయ్ గుండె దడదడ లాడింది—యిదమిద్ధమని తేల్చలేక అపరాధిలా నిలబడిపోయాను. అంత



వరకూ నాచెయ్యి పట్టుకున్న మురళీ నాచేయి వదిలేసి నాలుగైదు గజాల దూరం వెళ్ళిపోయాడు...స్కూటర్ వ్యక్తి నాభుజంమీద చెయ్యివేసి అదోలా నవ్వేడు....

నా వింతపరిస్థితికి ఏడవాలో.... నవ్వాలోకూడా నాకర్థం కాలేదు.

భుజం పట్టుకుని గట్టిగా కుదిపాడు స్కూ. వ్య.

'మీ....రు....' నోరు తడబడింది.

నావేపు ఆశ్చర్యంగా చూశాడతను.

ఒక్కడుగు వెనక్కి తగ్గాడు.

జేబులోంచి....పర్సు...పర్సులోంచి ఒఫొటోతీసాడు.....నాకందించాడు....

నాతల గిర్రున తిరిగిపోయింది – ఫోర్త్ఫారం చదువుతూండగా మేం యిద్దరం

కల్సి తీయించుకున్న ఫుటో అది. ..
సందేహంలేదు. .యీఫుటోలోవ్యక్తి 'మురళీయే'. మరి అతను ? ఏమో ?

నాసందేహం తీరిన ట్లనిపించింది —
యిద్దరం కౌంగలించుకున్నాం...

నాలుగ్గజాలదూరంలోఉన్న మురళీ నడక ప్రారంభించాడు...నా మనస్సింకా లాగుతూనేఉంది — ఎన్నో అనుమానాలు తిరిగి రేకెత్తాయ్... సందేహాలు విషసర్పాల్లా బుసలు కొడుతున్నాయ్...ఒకేరూపం...ఒకేఎత్తు ... యిద్దరూ దొరల్లా ఉన్నారు .... యిందులో ఎవరు మురళీ? ఎవరుమురళీ కాదు —

చటుక్కున ఓ ఆలోచన వచ్చింది — గబగబ నడిచి వెళ్తున్న మురళీని కల్సుకున్నాను. అదేముఖం ... ముఖంలో మార్పులులేవు .... సిగరెట్టు కాలుస్తూనే ఉన్నాడు ... అటు స్కూటర్ వైపు చూశాను. స్కూటర్ కు చెయ్యి ఆన్చి సిగరెట్ కాలుస్తున్నాడు మురళీ —

తిరిగి యిటు తిరిగాను.

'నీ దగ్గర పర్సుందా.'

జేబులోంచి తీసియిచ్చాడు.

రెండూ ఒకే రకమైన పర్సులు.

తెరిచాను.

యిద్దరం కల్సి తీయించుకున్న ఫోటో.

నిర్ఘాంతపోయాను —

పర్సు తను తీసుకుని జేబులో పెట్టేసుగున్నాడు ....

కొన్ని లక్షలమంది .... కోట్లమంది మురళీలు నా మదిలో మెదుల్తున్నారు— అందులో నాక్లాస్ మేట్ .... 'కొలీగ్' మురళీ ఎవరు? ఎవరు ? ఎవరు ?

స్కూటర్ వైపుగా నడిచాను — స్కూటరు మధ్యలోనే అట్నుంచి వస్తూ నన్ను దాటుకు వెళ్ళిపోయింది — మరో నిమిషంలో వాళ్ళిద్దరూ అదే స్కూటర్ మీద తిరిగి వస్తూ నా క్కొద్ది దూరంలో ఆగారు —

యిద్దర్నీ చూస్తూ అలా ఉండి పోవటం తప్పితే నే నేం చేయలేక పోయాను —

గుడ్ నైట్ యిద్దరిదీ ఒకేగొంతు —
కొద్దిగా నేను తేరుకునే సరికి స్కూట రక్కడ లేదు —

గిల్లుకు చూసుకున్నాను —

తెలివిగానే ఉన్నాను —

జేబులో చెయ్యి పెట్టాను —

పర్సు లేదు.